సాక్షి ప్రకాశం

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆర్యవైశ్య ఆరామ క్షేత్రాన్ని ఆయన ప్రారంభించారు. - 8లో..



పథకాలపై విస్తృత ప్రచారం చేయండి

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి కోరారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎస్పీ మలికా గర్గ్‌కు ఘనంగా వీడ్కోలు

- వీడ్కోలు సభలో గుంటూరు ఐజీ పాల్‌రాజ్, కలెక్టర్, ఇతర అధికారులు
- నేడు వీడ్కోలు పరేడ్ నిర్వహణ.. ఎస్పీ స్పందన తాత్కాలికంగా రద్దు



ఎస్పీ వీడ్కోలు సభలో గుంటూరు రేంజ్ ఐజీ పాల్ రాజ్, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్

ఒంగోలు సబర్బన్:

జిల్లా ఎస్పీ మలికా గర్గ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జిల్లా పోలీస్ అధికారులు నిర్వహించిన వీడ్కోలు సభలో మలికాగర్గ్ సేవలు కొనియాడారు. పోలీస్ విభాగానికి చెందిన గుంటూరు రేంజ్ ఐజీ పాల్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రెండున్నర సంవత్సరాలుగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను, ఎస్పీగా మలికా గర్గ్ ఇద్దరం ఒకేసారి బాధ్యతలు తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ మలికా గర్గ్ భర్త, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ కూడా పాల్గొన్నారు. వీరితో పాటు న్యాయమూర్తులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం 6.45 గంటలకు ఎస్పీ మలికాగర్గ్‌కు స్థానిక పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో వీడ్కోలు పరేడ్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశారు.

గ్రామ వికాసమే లక్ష్యంగా..

నాడు..

గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల్లో ఏ పని జరగాలన్నా జన్మభూమి కమిటీల ఆమోదం తీసుకోవాలి. ప్రజాస్వామ్యంగా ఎన్నికైన సర్పంచ్‌ల అధికారాలను టీడీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. రోడ్డు వేయాలన్నా, పింఛను కావాలన్నా జన్మభూమి కమిటీ సిఫార్సు ఉండాలి.

నేడు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం సాధించే ఉన్నత ఆశయంలో భాగంగా గ్రామ స్థాయిలో సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు ఇంటి ముంగిటకే తీసుకొచ్చారు. అభివృద్ధి ప్రణాళికలో సర్పంచ్‌లను భాగస్వాములను చేశారు.



చెన్నారెడ్డిపల్లి గ్రామ సచివాలయం

- గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- తొమ్మిది అంశాల్లో ప్రత్యేక శిక్షణ
- జిల్లాలో మొత్తం పంచాయతీలు 730
- జిల్లా వ్యాప్తంగా 245 మందికి శిక్షణ పూర్తి

మార్కాపురం: గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామ పంచాయతీలకు విడుదలయ్యే నిధులను వినియోగించేందుకు తొమ్మిది అంశాల ఆధారంగా గ్రామీణాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్దేశించడంతో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారు. ఈనెల 29వ తేదీలోగా జీపీడీపీ (గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్) పూర్తిచేయాలని ఆదేశించారు. అన్నీ పంచాయతీల్లో గ్రామసభ నిర్వహించి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని చెప్పడంతో జిల్లా వ్యాప్తంగా పంచాయతీ అధికారులు రిసోర్స్ పర్సన్స్‌ను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. ప్రతి మండలం నుంచి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లకు జీపీడీపీ తయారీపై శిక్షణ ఇచ్చారు.

జిల్లాలో గ్రామ పంచాయతీలు:

జిల్లా వ్యాప్తంగా మొత్తం 730 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఒంగోలు, మార్కాపురం, కనిగిరి డివిజన్లను ఏర్పాటు చేశారు. మార్కాపురం డివిజన్‌లో 229 పంచాయతీలు, కనిగిరి డివిజన్‌లో 280 పంచాయతీలు, ఒంగోలు డివిజన్‌లో 221 గ్రామ పంచాయతీలున్నాయి.

నవరత్నాలు లాంటి అంశాలే ప్రాతిపదికగా..

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం 9 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని గ్రామాభివృద్ధి ప్రణాళికను తయారు చేయాలని మార్గదర్శకాలు విడుదల చేసింది.

- పరిశుభ్రం, పచ్చదనం
- స్వయం సమృద్ధితోకూడిన మౌలిక సదుపాయాల ఏర్పాటు
- పేదరికంలేని మెరుగైన జీవనోపాధులు కలిగి ఉండటం
- నీటి లభ్యత కలిగి ఉండటం
- సామాజిక న్యాయం
- సుపరిపాలన
- సామాజిక భద్రత
- బాలలతో స్నేహపూర్వకంగా ఉండటం
- మహిళలతో స్నేహపూర్వకంగా ఉండటం

పై తొమ్మిది అంశాల ప్రాతిపదికగా గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రభుత్వం సూచించింది. తయారు చేసిన ప్రణాళికలను ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై జిల్లా వ్యాప్తంగా 245 మందిని రిసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చాం. ప్రతి మండలం నుంచి పంచాయతీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ జేఈలు, డిజిటల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చాం. ప్రణాళిక రూపకల్పనలో పంచాయతీలు ఎలాంటి నిబంధనలు పాటించాలి అనే విషయంపై మార్గదర్శకాలు ఇచ్చాం. గ్రామసభలు చేపట్టాలని తెలిపాం. 9 అంశాల ప్రాతిపదికగా ప్రణాళిక తయారు చేయాలని చెప్పాం. ప్రతి పంచాయతీ కనిష్ఠంగా ఒకటి, గరిష్ఠంగా రెండు అంశాలను ఎంచుకుని ప్రణాళికలు తయారు చేయాలి.



– జీవీ నారాయణరెడ్డి,
జిల్లా పంచాయతీ అధికారి, ఒంగోలు

శింగరకొండలో వైవీ పూజలు

- మాతృమూర్తి దీవెనలు తీసుకున్న వైవీ సుబ్బారెడ్డి



మాతృమూర్తి పిచ్చమ్మతో వైవీ సుబ్బారెడ్డి

ఒంగోలు సెంట్రల్: రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్న సందర్భంగా వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తమ ఇలవేల్పుగా భావించే బాపట్ల జిల్లా శింగరకొండలోని ప్రసన్నాంజనేయ స్వామిని సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వైవీ దంపతులకు స్వామివారి శేషవస్త్రాన్ని బహూకరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట అద్దంకి మాజీ ఏఎంసీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానె చిన హనిమిరెడ్డి ఉన్నారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి ఒంగోలులోని తన స్వగృహంలో ఉన్న మాతృమూర్తి పిచ్చమ్మ వద్దకు వెళ్లి ఆమె ఆశీస్సులు పొందారు.



ప్రత్యేక పూజల్లో వైవీ సుబ్బారెడ్డి దంపతులు, పక్కన అద్దంకి సమన్వయకర్త హనిమిరెడ్డి

వైనాట్ 175 లక్ష్యంతో ముందుకు సాగుదాం

- మార్కాపురం నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబుకు పూర్తి సహకారం అందించండి
- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మార్కాపురం సమన్వయకర్తగా ఎమ్మెల్యే అన్నా రాంబాబును పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు వైనాట్ 175 లక్ష్యంగా ముందుకు సాగుదామని ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు అన్నారు. ఆదివారం ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో మార్కాపురం నియోజకవర్గ నాయకులకు పార్టీ సమన్వయకర్తగా నియమితులైన గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబును ఎమ్మెల్యే కేపీ ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం నియోజకవర్గంలో తొలిసారిగా మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి తనయుడిగా నన్ను 2019 ఎన్నికల్లో సుమారు 18 వేల ఓట్లకు పైగా మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. వార్డు నాయకుల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వివిధ బోర్డుల డైరెక్టర్లు, ఏఎంసీ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఒక్కరూ ఈ రెండు నెలలూ కష్టపడి పనిచేస్తే అన్ని సీట్లలో విజయం తథ్యమన్నారు. నియోజకవర్గంలోని 82 పంచాయతీలు, 55 వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో మెడికల్ కాలేజీ ఉన్నా మరో కాలేజీని సుమారు రూ.500 కోట్లతో మార్కాపురానికి మంజూరు చేయడంలో సీఎం జగనన్న చేసిన కృషి అభినందనీయమని, విద్య, వైద్యంతోపాటు అన్నీ విధాలుగా రాష్ట్రంలో ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లారన్నారు. రాష్ట్రంలో 95 శాతం ప్రజలకు సంక్షేమ పథకాలతో సహాయం అందించామని, గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని కోరారు. జిల్లాలో 8 ఎమ్మెల్యే స్థానాలను గెలిపించుకోవాలనే లక్ష్యంతో మార్కాపురానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబును, గిద్దలూరుకు తనను సమన్వయకర్తలుగా నియమించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ పార్టీకోసం పనిచేసి గెలిపించాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ తాను కంభం మండలం సైదాపురంలో జన్మించానని, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి శిష్యుడిగా ఉన్నానన్నారు. కొన్నిరోజులు వ్యాపార కార్యకలాపాల్లో నిమగ్నమై.. ప్రజలకు సేవచేసే అదృష్టం కలిసిరావడంతో రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. 2019లో గిద్దలూరులో వైఎస్సార్ సీపీ తరపున పోటీచేసి రాష్ట్రంలో రెండో అత్యధిక మెజారిటీతో గెలుపునకు కారణం నియోజకవర్గ ప్రజలు, నాయకులే అని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో మన పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ఈ రెండు నెలల కాలంలో క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలన్నారు.

రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా సీఎం జగనన్న సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, చెన్నకేశవస్వామి ఆలయ మాజీ చైర్మన్ పీ కేశవరావు, ఎంపీపీలు పోరెడ్డి అరుణ, సూరెడ్డి భూలక్ష్మి, మురళి, కిట్స్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య, మాజీ ఏఎంసీ చైర్మన్ జీ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ ఏడుకొండలు, మాజీ జెడ్పీటీసీ రంగారెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ కొండయ్య, శివాలయం చైర్మన్ కేశవ శర్మ, కౌన్సిలర్లు దొడ్డ భాగ్యలక్ష్మి, బీ నాగేశ్వరరావు, కరీముల్లా, కే కృష్ణ, శ్రీనివాసులు, కోఆప్షన్ మెంబర్లు అమీరుల్లాఖాన్, వనజాక్షి, నాయకులు రమణారెడ్డి, శేఖరరెడ్డి, వెంకటరెడ్డి, తర్లుపాడు అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, సొసైటీ ప్రెసిడెంట్ రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, వివిధ బోర్డుల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మంత్రి ఆదిమూలపు సురేష్



ఇంటిగ్రేటెడ్ సచివాలయ సముదాయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి

- కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయాలన్న బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదిమూలపు సురేష్
- అనంతవరంలో ఇంటిగ్రేటెడ్ సచివాలయ సముదాయం ప్రారంభం

టంగుటూరు: ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని, దాని ద్వారా లక్షలాది నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని అనంతవరంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.05 కోట్లు, దాత ఏపీఎస్ రాజు ఇచ్చిన రూ.40 లక్షలతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ సచివాలయ సముదాయాన్ని వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిలను గుర్రపు బండిపై భారీ జనసందోహం మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. గ్రామంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సచివాలయ కాంప్లెక్స్‌కు రిబ్బన్ కట్ చేసి, సచివాలయం, హెల్త్‌కేర్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, మిల్క్ సెంటర్ భవనాలను, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు. అలాగే వెలగపూడి నుంచి ఆలకూరపాడు వయా అనంతవరం వరకు రూ.4 కోట్లతో మంజూరైన తారు రోడ్డుకు శంకుస్థాపన చేశారు.

కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయాలి..

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. కొండపి నియోజకవర్గ అభ్యర్థిగా మంత్రి ఆదిమూలపు సురేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకొని నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పొందాలన్నారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపునకు ఈ రెండు నెలలు అందరూ కలిసి కష్టపడాలన్నారు. అనంతవరం గ్రామస్తులందరూ చిన్న చిన్న విభేదాలున్నా కలిసికట్టుగా కష్టపడి ఇంత అద్భుతమైన సచివాలయ సముదాయాన్ని నిర్మించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇంత మంచి సచివాలయ సముదాయం జిల్లాలో ఎక్కడా లేదన్నారు. తన రాజకీయ జీవితం అంతా కూడా నాయకులు, కార్యకర్తల కోసమే పనిచేశాను తప్పా, పదవులు ఆశించలేదన్నారు. కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉంటుందని.. దాంట్లో ఎటువంటి సందేహం లేదన్నారు.

గ్రామ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తా..

మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ఇంతటి చక్కటి సచివాలయ సముదాయం, ఒక మోడల్ గ్రామంగా అనంతవరం ఉండటం సంతోషంగా ఉందని అన్నారు. పార్టీకి ఒక మంచి ఆయువుపట్టుగా ఉన్న అనంతవరం పంచాయతీని గుర్తుపెట్టుకొని మీకు కావాల్సిన పెండింగ్ పనులుంటే పరిష్కరిస్తానన్నారు. ఇప్పటికి జగనన్న 124 సార్లు బటన్ నొక్కి కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందించారన్నారు. ప్రభుత్వం పోరాడుతోంది పేదరికం మీదే నన్నారు. గత ప్రభుత్వంలో విద్య, వైద్యాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. సామాజిక న్యాయం, సామాజిక సాధికారిత ఒక నినాదం కాదని, జగనన్న ప్రభుత్వ విధానమన్నారు. తాను జగనన్న మంత్రివర్గంలో సహచరుడినని..గతంలో సంతనూతలపాడు, యర్రగొండపాలెం నియోజకవర్గంలో పనిచేసినట్లు చెప్పారు. జగనన్న పిలుపు మేరకు కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఇక్కడికి వచ్చానని.. మీ అందరి ఆశీస్సులు, దీవెనల కోసం అభ్యర్థిస్తున్నానన్నారు. రాజ్యాధికారంలో బడుగు, బలహీన, దళితవర్గాల వారికి పెద్దపీట వేసేందుకు సీఎం జగన్ పిలుపు మేరకు.. బాలినేని శ్రీనివాసరెడ్డి మంత్రి పదవి వదులుకోవడంతో తనకు మంత్రి పదవి వచ్చిందని చెప్పారు. వాసన్న ఆశీస్సులు, సహకారం కొండపి నియోజకవర్గంలో ఉండాలని కోరారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయాన్నందించి జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు. వాసన్న నాయకత్వంలో ఒంగోలు పార్లమెంటులో అన్ని స్థానాలు గెలిచి తీరుతామన్నారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, సర్పంచి ఉప్పలపాటి శివరామరాజు, ఎంపీటీసీ కసుకుర్తి కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, జెడ్పీటీసీ మన్నం అరుణకుమారి, సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, డాక్టర్ సునీల్, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ జాయింట్ సెక్రటరీ జిల్లా చంద్ర, వార్డు మెంబర్ మర్రి భాస్కరరెడ్డి, గ్రామ కన్వీనర్ ఉప్పలపాటి సుబ్బరాజు, శారీమందిర్ వెంకటేశ్వర్లు, మేండా శ్రీను, కన్నా వెంకట్రావు, సూదనగుంట నారాయణ, బీసీడి ఉదయ కుమార్, చిడిపోతు సుబ్బారావు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



బాలినేని, ఆదిమూలపు సురేష్‌లను గుర్రపు బండిపై ఘనంగా స్వాగతిస్తున్న గ్రామస్తులు

ఆధ్యాత్మిక క్షేత్రం అభివృద్ధికి కృషి

- త్రిపురాంతకం నూతన ట్రస్ట్‌బోర్డు ద్వారా సేవలు
- ప్రభుత్వ చీఫ్ విప్, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

త్రిపురాంతకం: పురాతనమైన పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రం త్రిపురాంతకంలోని శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాలకు నూతన పాలక మండలి నియామకం ద్వారా మంచి సేవలందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని ప్రభుత్వ చీఫ్‌విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయం సమీపంలో నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా ఆదివారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఆలయాలకు అందుబాటులో ఉండే భక్తుడు, వ్యాపారవేత్త ఐవీ సుబ్బారావును ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా, ట్రస్ట్‌బోర్డు సభ్యులను పారదర్శకంగా నియమించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ ఆలయాలకు వచ్చే భక్తుల్లో తాను కూడా ఉన్నానని, భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధి చేసేలా ట్రస్ట్‌బోర్డు కృషి చేస్తుందన్నారు. రెండు నెలల్లో ఎన్నికలు రానున్నాయని.. మంచి పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు దేశంలోనే ఏ రాష్ట్రంలో చేయని విధంగా సంక్షేమ పథకాలను అందించారన్నారు. తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు అందరూ మద్దతు పలకాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అందరూ తిరిగి అధికారంలోకి తెచ్చుకోవాలని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు అన్ని అసెంబ్లీ స్థానాల్లో తిరిగి విజయం సాధిస్తామన్న ధీమా వ్యక్తం చేశారు.

పవిత్ర పుణ్యక్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తా..

శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల నూతన పాలక మండలికి సహకరిస్తూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని యర్రగొండపాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. త్రిపురాంతకం ఆలయాలు రాష్ట్రంలో ఒక పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్నాయని, అలాంటి ఆలయాలకు నూతన పాలక మండలిని పారదర్శకంగా నియమించారన్నారు. అన్ని కులాలకు సముచిత స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఆదే విధంగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ నూతన పాలక మండలి నియామకంలో అన్నివర్గాల వారికి ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు. కేవలం కొన్ని పచ్చపత్రికలు, ప్రతిపక్షాలు విషం కక్కుతూ విష పురాతలు రాస్తున్నారని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేశారని త్వరలో సీఎం చేత ఈప్రాజెక్టు ప్రారంభించనున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి, వీహెచ్‌పీ జాతీయ ప్రధాన కార్యదర్శి యక్కలి రాఘవులు, శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్ సీహెచ్ కనకదుర్గ, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, గ్రామసర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, యల్లారెడ్డి, దొంత కిరణ్‌గౌడ్, విజయభాస్కర్, సుబ్బారెడ్డి, ఓబుల్‌రెడ్డి, బాలగురవయ్య, అరుణాబాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

భైరవకోనలో విద్యార్థుల సందడి

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం మండలంలోని భైరవకోనకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈసందర్భంగా ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, ఈఓ నర్రా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాదం, వసతులు ఏర్పాటు చేశారు. జలపాతం, త్రిముఖదుర్గాదేవి, కాలభైరవుడు, నగరేశ్వరస్వామివార్ల దర్శనం చేసుకున్నారు.



భైరవకోన చరిత్రపై విద్యార్థులకు వివరిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: జర్నలిస్టుల సంక్షేమానికి పూర్తి సహాయ సహకారాలు అందచేస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి గెస్ట్ హౌస్ ఆవరణలో జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి అధ్యక్షతన కనిగిరి ప్రాంత జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి నివేశన స్థలాలు అందచేస్తానని, హెల్త్ కార్డ్ స్కీంకు తన వంతు సహకారం అందచేస్తానని భరోసా ఇచ్చారు.

సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే బాలినేనికి రుణపడి ఉంటా

అతి సామాన్యుడిగా ఉన్న నన్ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థిగా ప్రకటించారని చెప్పారు. సామాన్యులకు, యువతకు ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా తనకు ఉన్నత స్థానాన్ని కల్పించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, తనకు అవకాశం వచ్చేందుకు పూర్తి స్థాయిలో సహకారం అందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డికి తాను ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. రాజకీయాల్లో ముందడుగు వేస్తున్న తనకు మీడియా మిత్రులు తన వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, కటికల వెంకటరత్నం, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, దాదిరెడ్డి మాల కొండారెడ్డి, యక్కంటి శ్రీను, చింతం శ్రీనివాసుల యాదవ్, పెన్నా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా



ఆర్యవైశ్య ఆరామక్షేత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆర్యవైశ్య నాయకులు



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

- ఆర్యవైశ్య ఆరామక్షేత్రం ప్రారంభోత్సవంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పాతికేళ్లుగా ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశానని, తన హయాంలో ఎప్పుడూ ఆర్యవైశ్యుల వ్యాపారాలపై దాడులు జరగలేదని తెలిపారు. ఇప్పుడే కాదని, ఎప్పటికీ నేను మీ వాడిని, మీ వాసుని అని అన్నారు. ఒంగోలు నగరంలోని గోరంట్ల థియేటర్ రోడ్డులో నిర్మించిన ఆర్యవైశ్య ఆరామక్షేత్రాన్ని ఆదివారం బాలినేని ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య ఆరామక్షేత్రం నిర్మాణంతో ఒంగోలు నగరంలోని నిరుపేద, మధ్యతరగతి ఆర్యవైశ్యులు పడుతున్న ఇబ్బందులు తొలగినట్లు భావిస్తున్నానని అన్నారు. కుప్పం ప్రసాద్‌తో పాటుగా మరికొందరు ఆర్యవైశ్య సోదరులు ఈ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. అనుకున్నట్లే 11 నెలల్లో ఆరామక్షేత్రం నిర్మాణం పూర్తి చేయడానికి కృషి చేసిన కమిటీ సభ్యులు, దాతలకు అభినందనలు తెలిపారు. ఆరామక్షేత్రం కోసం ఇస్తానని చెప్పిన రూ.10 లక్షలను గతేడాది బాపూజీ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన షాపు యజమానికి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్ని కష్టాలు, నష్టాలు వచ్చినా మంచిపని చేసేందుకు వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. ఒంగోలు నగరంలోని 25 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తానని చెప్పానని, దాని కోసం ఎంతటి కష్టాన్నయినా లెక్కచేయకుండా సాధించానని చెప్పారు. పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నామని, అధికారులు ఇచ్చిన లిస్ట్ ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇస్తామని తెలిపారు. సొంతిల్లు లేని నిరుపేద ఆర్యవైశ్యులకు కూడా ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. ఎవరికైనా ఇంటి స్థలం రాకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 25 వేల మందికి స్థలాలు ఇవ్వడానికి డబ్బులు ఎక్కడ ఉన్నాయని కొంతమంది విమర్శలు చేశారని, ఇప్పుడు 230 కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి స్థలాలు ఇచ్చేందుకు సిద్ధం చేస్తుంటే.. స్థలాలు కాదు.. పట్టాలు మాత్రమే ఇస్తారని విమర్శలు చేస్తున్నారని బాలినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి చేతనైంది విమర్శలు చేయడం ఒక్కటేనని ఎద్దేవా చేశారు. ఎంతో మంది భూములు కబ్జా చేస్తున్నారని, ఒంగోలులో స్థలాలను కబ్జా చేసిన వారిని శిక్షించేందుకు సిట్ వేయించానని చెప్పారు. భూ కబ్జాలపై సిట్ వేయించిన ఘనత తనకు మాత్రమే దక్కుతుందన్నారు.

మాట ఇస్తే కట్టుబడి ఉండే మనస్తత్వం ఎమ్మెల్యే బాలినేనిది...

అద్దె ఇళ్లలో నివసిస్తున్న నిరుపేద ఆర్యవైశ్యుల ఇబ్బందులను కరోనా సమయంలో కళ్లారా చూశానని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. అలాంటి సమస్య పరిష్కారానికి ఆధునిక సౌకర్యాలతో ఆరామక్షేత్రం నిర్మించడం వలన నిరుపేద, మధ్యతరగతి ఆర్యవైశ్యులకు ఇబ్బందులు తొలగుతాయన్నారు. ఎవరికైనా మాట ఇస్తే కట్టుబడి ఉండే మనస్తత్వం కలిగిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో కార్పొరేషన్ పరిధిలోని అత్యంత ఖరీదైన స్థలాన్ని ఆరామక్షేత్రానికి కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇందుకు సహకరించిన కార్పొరేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాల తరబడి ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించిన బాలినేని రుణం తీర్చుకోవాలని ఆర్యవైశ్యులను ఆమె కోరారు.

ఇక్కడ రాజకీయాలు మాట్లాడవద్దు...

కరోనా సమయంలో ఎంతో మంది ఆర్యవైశ్యులు చాలా ఇబ్బందులు పడ్డారని, దాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్యవైశ్య ఆరామక్షేత్రం నిర్మాణానికి పూనుకున్నామని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ తెలిపారు. అడిగిన వెంటనే కాదనకుండా ఆరామక్షేత్రానికి పట్టణ నడిబొడ్డులో ఖరీదైన స్థలాన్ని కేటాయించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వలనే నేడు ఆర్యవైశ్యుల కల నెరవేరిందన్నారు. ఆరామక్షేత్రంతో పాటుగా సుదీర్ఘకాలంగా వివాదంలో ఉన్న గోశాల సమస్యలను పరిష్కరించిన బాలినేనికి రానున్న ఎన్నికల్లో ఆర్యవైశ్య సోదరులు అండగా నిలబడాలని కోరారు. కుప్పం ప్రసంగానికి అభ్యంతరం చెప్పిన బాలినేని.. ఇది రాజకీయ వేదిక కాదని, ఇక్కడ ఎలాంటి రాజకీయాలు మాట్లాడవద్దని సూచించారు. త్వరలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ జరుగుతుందని, ఆర్యవైశ్య సోదరులంతా హాజరై విజయవంతం చేయాలని బాలినేని కోరారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. మునగా కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు శాండిల్య, జడా వెంకటేష్, ఇంతిజార్, చల్లా తిరుపతిరావు, అమరా శ్రీనివాసరావు, పడుచూరి రామస్వామి, తాతా మధుసూదనరావు, ఆర్‌ఎస్ శ్రీనివాస్, దేవత వినోద్, తదపరి వాసు, గోనుగుంట్ల జయకృష్ణ, నాగసూరి ఆనంద బాబు, మునగా తిరుమల వెంకటసుబ్బారావు, పబ్బిశెట్టి ద్వారకా, దేసు వీరయ్య, షాజహాన్, కఠారి శంకర్, జలీల్, పి.శ్రీనివాసరావు, పోటూరి సత్యనారాయణ, తాతా హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

కురిచేడు: స్థానిక ఎన్‌ఎస్‌పీ కాలనీలో నివాసముంటున్న చిప్పగిరి ప్రభావతి తన భర్త ఏడుకొండలు, అత్త సుబ్బలక్ష్మి, ఆడపడుచు రమణ వరకట్నం తేవాలని వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది. ఎస్సై సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. చిప్పగిరి ఏడుకొండలు, ప్రభావతిలకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. ఏడుకొండలు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. దుర్వసనాలకు లోనై నిత్యం ప్రభావతిని వేధిస్తుండేవాడు. శనివారం ఆమెపై స్క్రూడ్రైవర్‌తో దాడి చేసి గాయపరిచాడు. ఆ గాయాలతో ప్రభావతి దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

అర్ధవీడు (కంభం): ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వెలగలపాయ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. దున్నా స్వర్ణలత (30) అనే మహిళ కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా ధర్మప్రచార వారోత్సవాలు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయ ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా అష్టోత్తర పూజ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భక్తి గీతాలు ఆలపించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఈఓ బి.రమేష్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ సమస్యకు శాశ్వత పరిష్కారం



పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్, కార్పొరేటర్లు



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని

- రూ.2 కోట్లతో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు సబర్బన్: నగరంలోని భాగ్యనగర్ నాలుగో లైన్‌లో భారీగా ఏర్పాటు చేయనున్న మంచినీటి పైప్‌లైన్ పనులకు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆ పనులకు సంబంధించి భాగ్యనగర్ నాలుగో లైన్ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని బాలినేని ఆవిష్కరించారు. అనంతరం నాలుగో లైన్‌లో నాగేంద్రస్వామి గుడి వెనుక వైపు పైప్‌లైన్ పనులను లాంఛనంగా ప్రారంభించారు. దాదాపు రూ.2 కోట్లతో హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి భాగ్యనగర్ నాలుగో లైన్ వరకు పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ రోడ్డులో తరచూ పైప్ లైన్ లీకేజీలు, మరమ్మతులకు శాశ్వత పరిష్కారం కోసం నిధులు మంజూరు చేసి కొత్త పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే బాలినేని వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.జస్వంతరావు, 19వ డివిజన్ కార్పొరేటర్ ఈరద సురేష్‌బాబు, 20వ డివిజన్ కార్పొరేటర్ పసుపులేటి విజయలక్ష్మీ శ్రీనివాసరావు, 31వ డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ పి.గోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ షేక్ రహంతు జానీ, ఏఈ డి.అనిల్, నాయకులు పాల్గొన్నారు.

చారిత్రక శాసనాలను వెలుగులోకి తెచ్చిన ఇలియట్



సమావేశంలో ప్రసంగిస్తున్న కొండా శ్రీనివాసులు

ఒంగోలు టౌన్: చారిత్రక శాసనాలను వెలుగులోకి తీసుకురావడానికి ఇలియట్ చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందని ప్రముఖ చారిత్రక పరిశోధకుడు డాక్టర్ శ్రీనివాసులు కొండా అన్నారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీలో జరుగుతున్న జాతీయ సెమినార్ ముగింపు సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ ఇలియట్ తన జీవిత కాలంలో అనేక చారిత్రక శాసనాలను వెలుగులోకి తీసుకొచ్చారని తెలిపారు. శాసన అధ్యయనానికి అవి మార్గదర్శకంగా పనిచేస్తాయని చెప్పారు. ఇలియట్ జీవితం గురించి అనేక ఘటనలు, పలు చారిత్రక విషయాలను ఆయన వివరించారు. చరిత్ర అనేది జీవం ఉన్న కళ లాంటిదని, చారిత్రక అంశాలు భవిష్యత్తు తరాలకు దర్పణాలుగా పనిచేస్తాయని ఏకే యూనివర్శిటీ పాలకమండలి సభ్యురాలు టి.సుమతి అన్నారు. 48వ ఈఎస్ఐ, 42వ సీఎస్ఎస్ఐ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన జాతీయ సెమినార్‌కు అధ్యక్షత వహించిన చరిత్ర విభాగాధిపతి డాక్టర్ జి.సోమశేఖర్ మాట్లాడుతూ.. జాతీయ సెమినార్ యువ పరిశోధకులను ప్రోత్సహించేదిగా జరిగిందన్నారు. గతంలో తిరుపతి, హైదరాబాద్‌లో జరిగిన సెమినార్‌లలో తాను పాల్గొన్నానని, అక్కడ ఎక్కడా చూడని ఆహ్లాదకర వాతావరణం ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో కనిపించిందని ఈఎస్ఐ ఎడిటర్ పీఎస్ నారాయణమూర్తి తెలిపారు. 2024–25 సంవత్సరానికిగానూ ఈఎస్ఐ కమిటీకి పాలకమండలి సభ్యుడిగా ఏకేయూ డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డిని ఎంపిక చేసినట్లు పీఎస్ఎస్ఐ చైర్మన్ డా.టీఎస్ రవిశంకర్ ప్రకటించారు. ఈ సందర్భంగా సెమినార్‌ను విజయవంతంగా నిర్వహించిన త్రిమూర్తులు డా.వెంకటేశ్వరరెడ్డి, డా.బి.రామచంద్రారెడ్డి, డా.కొండా శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మనసు ఫౌండేషన్ చైర్మన్ డా.మన్నం వెంకటరాయుడు, అవధానం ఉమామహేశ్వరశాస్త్రి, ఎంవీఆర్ వర్మ, యేసుబాబు, డా.కృష్ణమూర్తి, డా.సూర్యకుమార్, శేషతల్ప సాయి, డా.శివనారాయణ, ఏకేయూ సీఈ డా.జ్ఞానేశ్వరరెడ్డి, ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ పాల్గొన్నారు.

పథకాలపై విస్తృత ప్రచారం చేయండి

- వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- కేపీహెచ్‌బీలో వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో దర్శి ప్రజల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి



ఐటీ, నాన్ ఐటీ ఉద్యోగులతో ర్యాలీగా సభాస్థలికి వెళ్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి(కురిచేడు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీ కమ్యూనిటీ హాలులో దర్శి నియోజకవర్గ ఐటీ, నాన్ ఐటీ ఉద్యోగులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తొలుత కూకట్‌పల్లిలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ప్రదర్శనగా సభాస్థలికి వెళ్లారు. వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు సునీత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన నాడు–నేడు, పారిశ్రామిక క్లస్టర్‌లు, రామాయంపోర్టు, అర్హులైన పేదలందరికీ దళారులతో ప్రమేయం లేకుండా లక్షల కోట్ల రూపాయలు నేరుగా జమ చేయడం వంటివి చంద్రబాబుకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కరోనా కష్ట కాలంలో టీడీపీ నేతలు ఇళ్లలో దాక్కుంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి వ్యక్తి బాధ్యత తీసుకున్నారన్నారు. టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆ బాధ్యతను ఐటీ నిపుణులు, వైఎస్సార్ సీపీ అభిమానులు తీసుకోవాలని ఆయన కోరారు. వారంలో రెండు రోజులు నియోజకవర్గానికి కేటాయించాలని ఆయన ఐటీ నిపుణులను, అభిమానులను కోరారు. బూచేపల్లి కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టింది వైఎస్ కుటుంబమేనని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కుటుంబాన్ని తన కుటుంబంలా భావించి తన తల్లి బూచేపల్లి వెంకాయమ్మను జెడ్పీ చైర్‌పర్సన్‌ను చేయడంతో పాటు తనకు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించారని పేర్కొన్నారు. బూచేపల్లి కుటుంబం ఎప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అడుగులు వేస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కోవిడ్ సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కార్యక్రమాలు దేశం మొత్తం చూసిందన్నారు. చాలా మంది యువతకు రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టి ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్యక్రమాలు, ప్రస్తుతం జగన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు–నేడు కార్యక్రమాలు పేద, మధ్య తరగతి వారి అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 43 ఏళ్ల తరువాత మొదటిసారిగా కలుసుకున్న పూర్వవిద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1980-81 పదో తరగతి పూర్వ విద్యార్థులు



తరగతి గదిలో ఆనందంగా కూర్చున్న పూర్వ విద్యార్థులు

ఇంకొల్లు (చినగంజాం): ఏరా ఎలాగున్నావ్.. ఎన్నాళ్లయిందో మిమ్మల్ని చూసి. ఇంట్లో అందరూ బాగున్నారా అంటూ ఒకప్పటి బాల్య స్నేహితులు నాలుగు దశాబ్దాల తరువాత కలుసుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. షష్టి పూర్తి చేసుకునే తరుణం ఆసన్నమవుతున్న సమయంలో ఒక్కసారిగా కలుసుకోవడంతో అందరూ బాలలుగా మారి ఆనందోత్సాహాలతో తమ అమూల్యమైన సమయాన్ని కొద్ది గంటల పాటు గడిపారు. కరచాలనాలు, కౌగిలింతలతో తమ కలయికను పూర్తి కానివ్వక చిన్నప్పటి అనుభవాలను నెమరు వేసుకుంటూ మనస్ఫూర్తిగా నవ్వుకున్నారు. ఎన్నో భావోద్వేగాల మధ్య తమకు దొరికిన ఆ కొద్ది మధుర క్షణాలను ఆనందంగా గడిపారు. ఏదో తెలియని ఆనందం, వింత అనుభూతుల మధ్య వారంతా కలిసి ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. నాలుగు దశాబ్దాల తరువాత తన ఒడిలో విద్యనభ్యసించిన చిన్నారులను చూసుకొని వారు చదివిన పాఠశాల కూడా ఎంతో మురిసిపోయింది.

ఆత్మీయ పలకరింపులతో మురిసిపోయారు..

ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలో ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశం అయ్యారు. పాఠశాలలో 1980–81లో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు 43 ఏళ్ల తరువాత మొదటిసారిగా కలుసుకున్నారు. సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఆప్యాయ పలకరింపులతో సరదాగా గడిపారు. కుటుంబ సభ్యులను ఒకరినొకరు పరిచయాలు చేసుకున్నారు. అనంతరం పాఠశాలలో తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు. వారికి అందుబాటులో ఉన్న సైన్సు ఉపాధ్యాయులు ఎస్ నాగేశ్వరరావు, పీవీ సుబ్బారావు, మరో ఉపాధ్యాయుడు వెంకటరెడ్డి మాస్టారు చనిపోవడంతో ఆయన కుమారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి రాఘవరెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేసి అనంతరం తమ జ్ఞాపకాలను, అనుభవాలను కుటుంబ సభ్యుల పరిచయాలతో తమకున్న కాలాన్ని గడిపారు.